
ప్రిన్సిపాల్ శాస్త్రి ఆలోచిస్తు న్నాడు....

అటెండర్ ఉద్యోగం కోసం ఇంటర్వ్యూకి నలుగుర్ని పంపారు ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజి వాళ్ళు. ప్రభుత్వ ఉత్తరువు ప్రకారం ఈ సారి హరిజన్‌ని ఎంచుకోవాలి. కాని....



శాస్త్రికి శర్మ దీన వదనం పదే పదే జ్ఞాపకం వస్తోంది. శర్మ బి.ఏ. ఫస్ట్ క్లాస్. ఏ ఉద్యోగమూ దొరక్క దీనికి సిద్ధపడ్డాడు. 'ఇదీ దక్కక పోతే ఆత్మహత్యే శరణ్యం' అని ఏడ్చాడు.

ప్రభుత్వ ఉత్తరువులో ఏదో లోపం వెదికి, ధైర్యంగా శర్మకి ఉద్యోగం ఇవ్వవచ్చు. కాని తన కొడుకు ఒక బ్యాంక్ ఇంటర్వ్యూకి వెళ్ళాడు. అతనికి న్యాయం జరగా లంటే తను ఇక్కడ న్యాయంగా వ్యవహరించాలి - అన్న సందే హంతో అతడు కొట్టుమిట్టాడు తున్నాడు.

ప్రిన్సిపాల్ గది గుమ్మం వద్ద స్టూలు మీద కూచుని, శాస్త్రి వినే టట్టుగానే బిగ్గరగా ఎవరితోనో మాట్లాడుతున్నాడు నారాయుడు.


"ఫైళ్ళు మోయడం, నోటీసులు తిప్పడం, బెల్లు కొట్టడం ఈ పను లకు డిగ్రీ లెందుకంటా? ఉద్యోగం అడగవచ్చినోడికి బుద్ధి లేకపోతే ఇద్దామనే వాడికుండాలి...."

# కలిసి ముందుకు సాగుదాం

(-ప్రఫుల్లచంద్ర)

అధికారి ఇలాంటి మాటల్ని విననట్టు నటించి జీర్ణం చేసుకోవాలని శాస్త్రికి తెలుసు. నారాయడికీ తెలుసు.

నారాయడు ఆ స్కూలు పుట్టినప్పటినుండీ అటెండర్‌గా పని చేస్తున్నాడు. ఆ రోజుల్లో చేతులు కట్టుకొని అధికారులను చూచి గజ గజలాడి పోయేవాడు. ఎదురు చెప్పడం అన్న




ప్రశ్నే లేదు.

రోజులు మారిపోయాయి....

దళిత వర్గాలకు ఆశాజ్యోతిగా ప్రభుత్వం అనేక శాసనాలు ప్రవేశపెట్టడంతో వారిలో సామాజిక స్పృహ కలిగింది

నారాయడు కూడా క్రమంగా చాలా విషయాలు నేర్చుకున్నాడు.

కొద్ది కాలం క్రితమే ఆ పాఠశాలను ప్రభుత్వం స్వాధీనం చేసుకుని, జూనియర్ కాలేజీగా మార్చి ఒక ప్రిన్సిపాల్‌ని నియమించింది. అప్పటినుంచే నారాయడు వెలగడం ప్రారంభించాడు.

ఆ ఊరికి పది మైళ్ళ దూరంలో గల మరో ఊరి పొలిమేరల్లో హరిజనవాడ నిర్మించింది ప్రభుత్వం. దానిలో ఒక ఇల్లు సంపాదించాడు నారాయుడు. భార్య పేరున రెండు బ్యాంకుల్లోంచి రుణాలు తెచ్చి రెండు గేదెలు కొన్నాడు. చేతిలో రెండు పైసలు ఆడుతున్నాయి. ప్రభుత్వ ఉద్యోగి. పైగా మాట నేర్పరితనం వుంది. ఆ వాడలో మకుటంలేని మహారాజు అయ్యాడు. వ్యవహారాలు ఎక్కువైనాయి. దానా దీనా డ్యూటీలో అశ్రద్ధ పెరిగింది. ఆలస్యంగా రావడం, ముందుగా వెళ్ళిపోవడం అలవాటు అయింది.

కాలేజీలో కూడా వాళ్ళకూ, వీళ్ళకూ పనులు అప్పగించి- తను ఏదో మూల కబుర్లు చెబుతూ కూర్చోవడం మొదలు పెట్టాడు తనను ఉద్యోగంనుండి ఎవరూ తీసి వేయలేరు. బదిలీ చేయనూ లేరు. ఈ విషయం అతనికి బాగా తెలుసు. మాష్టార్లకే పదో పరకో చేబదులు ఇచ్చే స్థితికి ఎదిగాడు. మరికొందర్ని "ఏవయ్యా పంతులూ!" అని ఏక వచనంలో సంబోధించే ధైర్యవంతుడయ్యాడు.

ఏమీ తోచకపోతే స్టాఫ్ రూంలో మాష్టార్లతో తగవు తెచ్చుకోడం అతని హాబీ! తెలుగు మాష్టారు మరీ లోకువ.

"మేం శుభ్రంగా ఉండవంనే కదా మీరు 'అసింటా, అసింటా' అంటూ తప్పించుకు తిరుగుతారు. మరి మీరెంత శుభ్రంగా ఉన్నారో- అద్దంలో ఒకసారి చూచుకోండి. ఎవరు అంటరాని వారో తెలుస్తుంది?" అనేశాడు ఒకసారి నారాయుడు.

నిజమే! తెలుగు మాష్టారికి ముక్కుపొడి బాగా అలవాటు. ముక్కు అసహ్యంగా స్రవిస్తూ వుంటుంది. చీదుకొని గోడలకూ. బీరువాలకూ రాస్తూంటా డాయన, కండువా నిండా మరకలే!

"హోటల్‌లో ఏ వెధవ కాఫీ కలిపినా మీకు ఇబ్బంది లేదు. కాని మా చేతి మంచినీళ్ళు కూడా మీకు పనికి రావు. కాని మీరు చీదుకుని గోడలకు రాసిన దాన్ని మేం అమృతంగా భావించాలి" అన్నాడింకో సారి. మిగిలిన వాళ్ళు నవ్వేసారు.

పండితుడికి మండి, కోపం పెల్లుబికినా, గుర్రుగా చూస్తూ వూరకున్నాడు.

ఇద్దరి మధ్య పచ్చ గడ్డి భగ్గుమంటే. మంట రాజేసి చలి కాచుకునే వాళ్ళే గాని ఆర్పడానికి ప్రయత్నించరు కదా ఎవరూ!

"ఒరేయ్! మీరు మత్స్య మాం

సాదులు తింటారు రా! విందు ప్రాణాలు తీసి, శవాల్ని తినడం ఘోరం కాదుట్రా?" బ్రాహ్మణ యాసతో మాటల్ని ఒత్తి పలుకుతూ మంట ఎగదోశాడు రెడ్డిగారు- తాను మాంసం తిననట్టు.

"మాంసం తినక పోవడమే గొప్ప తనం అయితే గాడిద కన్నా గొప్ప వాళ్ళెవరూ లేరు ఈ ప్రపంచంలో!- అని ఒక మహా రచయిత-ఆయనా బ్రాహ్మడే- అన్నారు!" నారాయుడి సమాధానం.

నవ్వులు.... నవ్వులు!....సద్దుమణి గాక, "ఈ తెలుగు మాష్టారి అబ్బాయే పట్నంలో కోడి పలావ్ తినడం కళ్ళారా నేను చూసాను. మీ లెక్కన అతడూ అంటరాని వాడే కావాలి! మరి ఈ మాష్టారు కొడుకుని తాకరా? అది మైల కాదా? ఎందుకీ తేడా? మేష్టారు అబ్బాయి గ్రేడ్ వన్ అంటరానివాడు. నేను గ్రేడ్ ఫైవ్! అంతేనా?" నవ్వుతూనే అంటించాడు నారాయుడు.

మేష్టారి తల వంగిపోయింది. రెడ్డిగారి ఉత్సాహం పెరిగింది.

"నువ్వు ఎంతగా సమర్థించుకున్నా, మీకు శుభ్రత తక్కువ. మీ యిళ్ళూ, చేసే పనులూ అసహ్యం!" అన్నాడు అదే యాసతో.

అన్నది రెడ్డిగారు కాబట్టి నారాయుడికి కోపం రాలేదు!

"మీరు బ్రాహ్మల యిళ్ళు చూడలేదా? వాళ్ళ మడి బట్టలు ఎంత శుభ్రంగా వుంటాయో, మడి పేరుతో ఎంత చెండాలం చేస్తారో మీకు తెలియదు కాబోలు. పిల్లలు ముడ్డి, పెద్దలు పశువుల్నీ కడుక్కునే చెరువులో మడి స్నానం చేసే మహాతల్లిని నేను ఎరుగుదును. అదీ వారి శుభ్రత!" ఎగతాళిగా అన్నాడు.

అంతవరకూ సహించిన ఇతరులు నోరు విప్పారు. కాని నారాయుడి స్వరం పది గళాల పెట్టు. స్టాఫ్ రూం ధ్వని రంగం అయింది. నవ్వుకుంటూ- రెడ్డిగారు జారుకున్నారు.

శాస్త్రికీ విషయాలు తెలుస్తూనే వున్నాయి... కాని ఏం చేయగలడు? తను నోరు మెదిపితే తల బొప్పి కట్టడం తథ్యం. నారాయుడ్ని దారిలో పెట్టబోయి వెనకటి ప్రిన్సిపాల్ పొందిన అవమానం శాస్త్రికి తెలుసు!

ఆ రోజుల్లో-ప్రిన్సిపాల్ తనని అనవసరంగా వేధిస్తున్నాడనీ, తనకు రక్షణ కావాలనీ పెద్దలందరికీ మహజర్లు పెట్టుకుని యాగి చేసాడు నారాయుడు. చిలికి చిలికి గాలి

వాన అయింది. అందులో అప్పటి ప్రిన్సిపాల్ కొట్టుకు పోయి, శాస్త్రి వచ్చాడు.

ఈయన వచ్చిన కొత్తలో నారాయడు కాస్త వినయంగా వున్నా, యిప్పుడిప్పుడే నోటికి స్వతంత్రం ఇస్తున్నాడు.

వాడి నోటికి జడిసే-శాస్త్రి-శర్మను కాదని, ప్రసాద్‌కి అటెండర్ ఉద్యోగం యిచ్చాడు.

* * *

నారాయడి సంగతి తెలిసి కూడా కొందరు అతనిని కదిలిస్తూ వుంటారు.

"ప్రభుత్వానికి అల్లుడివి రా నువ్వు! ఏ పనీ చేయకుండానే జీతం కొట్టేస్తున్నావ్! ప్రిన్సిపాల్ దేవుడు కాబట్టి నీ ఆటలిలా సాగుతున్నాయి" అన్నాడు ఇంగ్లీషు మాష్టారొకసారి.

ధీమాగా నవ్వాడు నారాయడు. "పంతులుగారూ! క్లాసులో మీరింత వరకూ ఎన్ని పాఠాలు చెప్పాలి? ఎన్ని చెప్పారు? మీరు చెప్పే ముక్క... రామ రామా...ఒక్కటీ అర్థం కాదని పిల్లలు గోలెడుతున్నారు. పిల్లలకు అర్థం కాని చదువు చెబుతున్నందుకు మీకిచ్చే జీతం కూడా దండగే! ప్రిన్సిపాలుగారు అమాయకులేం కాదు. నన్ను శిక్షిస్తే మీలాంటి అందర్నీ శిక్షించాలి. అందుకే అందర్నీ ఒదిలేసాడాయన!" అంటూ తత్వం బోధించాడు.

స్టాఫ్ రూంలోని విశేషాలన్నీ ఎప్పటికప్పుడు శాస్త్రికి తెలుస్తూనే వుంటాయి. కొంచెం బిగించక పోతే మర్యాద దక్కదు అనుకున్నాడు. స్వ పర భేధం లేకుండా, పక్షపాత రహితంగా ప్రవర్తనా నియమావళిని అమలు జరపడం మొదలు పెట్టాడు. ఇష్టులకు కూడా కష్టాలు! లేటు మార్కులూ; సెలవుల కోతలూను!

అట్లా నారాయడికి మూడు సెలవులు కోత పడ్డాక-జీతం కోసి వేయడం జరుగుతుందని వ్రాత మూలకంగా హెచ్చరించాడు శాస్త్రి.

ఏమీ చేతగాని వాడిలా కనిపించిన శాస్త్రిలోని కార్య దక్షతకు ఆశ్చర్యపోయారంతా. నారాయడు సమయంకోసం వేచి చూస్తున్నాడు. ఏ బాధా లేని వాడు కొత్త అటెండర్ ప్రసాద్ ఒక్కడే! తన పని శ్రద్ధగా చేసుకుంటూ అందరి మన్నన పొందుతున్నాడు.

"ఉద్యోగం ఖాయం అయ్యేంత వరకూ అందరూ బుద్ధిమంతులే!" ఈసడించాడు నారాయడు. తన కులం వాడు తనకే పోటీ రావడం

అతడికి నచ్చలేదు.

ప్రసాద్‌ని తన అల్లుడుగా చేసుకొని తన వైపు తిప్పుకుందామనుకున్నాడు నారాయుడు. కాని వాకబు చేయగా ప్రసాద్ యింకా అడుగు కులం వాడని తేలింది. శాస్త్రి ప్రసాద్‌ని ఆదరిస్తున్నాడు. ఇంతకు ముందులా-ప్రిన్సిపాల్ హరిజనులను పీడిస్తున్నాడని యాగీ చేయడానికి వీల్లేకపోయింది నారాయుడికి. పథకం వేస్తున్నాడు.

నారాయుడి కూతురు సరోజ ఆ కాలేజీలోనే ఇంటరు చదువుతోంది. బురదలాంటి కులంలో పుట్టినా, ఆ బురదకే మాన్యత తెచ్చేలా పెరగాలని, ఎంచి ఎంచి ఆమెకా పేరు పెట్టాడు నారాయుడు.

ప్రసాద్ ఉద్యోగంలో చేరి మూడు నెలలయింది.

అతడు అర్జెంట్‌గా సరోజతో చూపు కలిపి, మరో పది రోజులకు మాట కలిపి, దేవుడను గ్రహిస్తే వేసవిలో చేతులు కలపాలి అని నిర్ణయించుకున్నాడు.

అది గ్రహించిన ఒక మేష్టారు వాళ్ళకి పెళ్ళి చేసెయ్యమని నారాయుడికి సలహా యిచ్చాడు.

"మేం గ్రేడ్ ఫైవ్ అంటరాని వాళ్ళం. వాడు గ్రేడ్! టెన్! కుదరదు!" నవ్వేసాడు నారాయుడు.

'మీలో కూడా ఇన్ని కులాలున్నాయా?'అని ఆశ్చర్యపోయాడా మాష్టరు!

* * *

ఆ రోజు....

నారాయుడి కొడుక్కి జాతీయ బ్యాంకులో ఉద్యోగానికి ఆర్డర్ వచ్చింది. శాస్త్రి కొడుక్కి రాలేదు. జరగ కూడని దేదో జరిగిపోయినట్టు అందరూ బాధపడ్డారు శాస్త్రితో సహా.

నారాయుడి హుషారు పుండుమీద కారంలా వుంది చాలా మందికి. తెలుగు మేష్టారు యిక ఉండబట్టలేక, "ఈ రోజులు మీవిరా!" అని నిట్టూర్చాడు.

జోరుగానే సమాధానం చెప్పాడు నారాయుడు—"మీ రిప్పుడిలా అంటున్నారుగాని కొన్ని వేల సంవత్సరాలనుండీ మీరు చేస్తున్నదేమిటి? మీ చుట్టూ ఒక గోడ కట్టుకొని మమ్మల్ని అవతలకి నెట్టేసారే! మమ్మల్ని పురుగుల కన్నా హీనంగా చూస్తున్నారే! తాకితేనే మైల పడినట్టు స్నానాలు చేస్తున్నారే! మీకు మేం సేవలు చేయాలి. మీ పొలాలు పండించాలి. కాని బాధలు మాకు- భోగాలు మీకు! శ్రమ మాది- ఫలితం మీది!

"మే మెక్కడ తెలివి మీరి

పోతామో అన్న భయంతో మేం చదువుకోడానికి వీల్లేదని శాసించారే మీరు! అజ్ఞానంలో తోసి వేసారే! శుచి శుభ్రతలు లేకుండా రోగాలతో చావండని మురికి కూపాలలోనికి నెట్టి వేసారే! మమ్మల్ని అసలు మనుష్యుల్లా చూసారా ఎప్పుడైనా? ఒక్కసారి వెనక్కి తిరిగి చూచుకోండి మాష్టారూ!

"మీ పూర్వులు కల్లు తాగేవారు. గోమాంసం తినేవారు. ఇప్పటికీ ఉత్తరాదిన బ్రాహ్మణులు చేపలు తింటారు. ఇప్పుడు మీరు మాంసాహారాన్ని విసర్జించి ధర్మ పన్నాలు చెబుతున్నారు! మాంసం తింటున్నందుకు మమ్మల్ని నీచంగా చూస్తున్నారు. మీ బండారం బయట పడుతుందని భయం కాబోలు—అసలు మేము వేదాల్ని ముట్టుకోడానికే వీల్లేదని సెలవిచ్చారు!"

ఊపిరి పీల్చుకోడానికో, తన ఉపన్యాస ప్రభావం గమనించడానికో, కాసేపు ఆగి చుట్టూ చూసాడు నారాయుడు.

కాకలు తీరిన రాజకీయ నాయకుడిలా గడగడ ఉపన్యసిస్తున్న వాణ్ణి చూసి, 'వీడు నారిగాడేనా?' అని ఆశ్చర్య పోతున్నారు అందరూ.

తెలుగు మేష్టారు ఖిన్నుడై పోయాడు.

పరిస్థితి చప్పబడిపోయేట్టు కనిపించగానే రెడ్డి అంటించాడు—"అదంతా గతం. ఎప్పుడో జరిగిన దానికి ప్రాయశ్చిత్తంగా, యిప్పుడు మీరు ఉద్యోగాలూ, ప్రమోషన్లూ కొట్టేసి వాళ్ళని తొక్కేయడం ఏం న్యాయం చెప్పు?" అంటూ.

"కొన్ని రోగాలు తండ్రినుండి ఏ పాపమూ ఎరుగని బిడ్డలకు సంక్రమించడం ప్రకృతి న్యాయం. తండ్రి చేసిన అప్పులు కొడుక్కి తగులు కోవడం సమాజ న్యాయం. పెద్దలు చేసిన పాపానికి కుటుంబం అంతా నాశనం కావడం పురాణ న్యాయం. మా కిప్పుడు ప్రభుత్వం యిస్తున్న సౌకర్యాలు ప్రకృతి న్యాయం, సమాజ న్యాయం; మళ్లా మాట్లాడితే పురాణ న్యాయం-అమలు జరపడానికి. మీ పూర్వుల పాప ఫలం మీరు అనుభవించాలి. మీరు గతంలో అనుభవించిన భోగాలు మమ్మల్ని కొంత కాలం అనుభవించనీయండి. తరువాత మీరు కూడా ఆందోళనలు జరిపి రిజర్వేషన్లు పొందవచ్చు!" భళ్ళున నవ్వాడు.

తెలుగు మాష్టారి మొగం కంద

గడ్డ అయింది. ఇంగ్లీషు మాష్టారు కలుగజేసుకొని, "నువ్వీ ఉద్యోగం చేయలేవు గాని ఎన్నికల్లో నిలబడు!" సలహా యిచ్చాడు- వాతావరణం తేలికబరచడానికి.

"రిటైర్ అయ్యాక అలాగే నిలబడతా! మినిష్టర్ని అవుతా! మన కాలేజీకి విజిట్ వస్తా! అప్పుడు మీరంతా యిక్కడే వుంటారుగా!" అన్నాడు హుషారుగా.

"ఓరి నీ అసాధ్యం కూలా! అప్పుడే మినిష్టర్ ఆయినట్టు ఆ ఫోజు!" ఉక్రోషం పట్టలేక పోయాడు తెలుగు మాష్టారు.

* * *

విజయం విస్కీ కంటె ఎక్కువ కిక్ యిస్తుంది. ప్రస్తుతం నారాయుడు ఆ కిక్‌లో వున్నాడు. తాను ఎన్నో విజయాలు సాధించి నట్లు మురిసిపోతున్నాడు. వాడలో అందరూ అతనిని ఆకాశానికి ఎత్తి వేస్తున్నారు.

కొడుక్కి ఉద్యోగం—అదీ బ్యాంకిలో లభించిన సందర్భంగా వాడలోని ముఖ్యులందరికీ 'తెల్ల నీళ్ళ' పార్టీ యిచ్చాడేమో! ఆ మత్తుకి ఈ మత్తు తోడై ఒకటే కోలా హలం- అర్ధరాత్రి వరకూ.

నిషా తగ్గి నిద్ర పట్టేసరికి బాగా ఆలస్యం అయింది. మత్తు వదిలి లేచేసరికి పది. షాక్ కొట్టి నట్టు చుట్టూ చూసాడు నారాయుడు. ఇంట్లో ఎవరూ లేరు. సరోజ కాలేజీకి వెళ్ళిపోయింది. తండ్రి ఆశీర్వాదం పొంది ఉద్యోగంలో చేరడానికివెళ్ళాలనుకున్న అబ్బాయి కూడా కనిపించలేదు. పెళ్ళాం పొలం పనికి వెళ్ళినట్టుంది.

తనను నిద్ర లేపకుండా ఎవరి దారిన వారు వెళ్ళిపోయినందుకు కోపం వచ్చింది నారాయుడికి.

కాలకృత్యాలు తీర్చుకొని ఎంత వేగంగా సైకిల్ తొక్కినా-కాలేజీకి వెళ్ళేసరికి 12 దాటుతుంది. గంట తరువాతగాని బస్సు లేదు.

'సెలవు పెట్టకుండా కాలేజీ మానేస్తే?—ప్రిన్సిపాల్ అసలే పగపట్టి వున్నాడు ఇప్పుడేమిటి చేయడం?

'ఏదో విరుగుడు ఆలోచించాలి'- అనుకుంటూ సైకిల్ తీసాడు.

కాలేజీలో అడుగు పెట్టగానే మెమో ఎదురైంది. తన సర్వీస్‌లో మెమో ఎరుగడు. రెడ్డిగారితో ఆలో చించి సమాధానం రాసాడు. తాను పెందరాళే బయలుదేరాననీ, దారిలో హఠాత్తుగా విరేచనాలు పట్టుకున్నా యనీ, డాక్టరు వద్దకు వెళ్ళి మందు తీసుకుని విశ్రాంతి తీసుకోమని డాక్టరు సలహా ఇచ్చినా వినకుండా,

బాధ్యత తెలిసిన ఉద్యోగి కనుక- ఆలస్యంగానైనా కాలేజీకి వచ్చాననీ.

మెమో బాధ మనసులో ఉండగానే అతనికి మరో దుర్వార్త తెలిసింది. సరోజ కూడా ఆలస్యంగా వచ్చిందట. ప్రిన్సిపాల్ ఆమెను హెచ్చరించి క్షమార్పణ పత్రం రాయించుకున్నారట.

"ఇదంతా నీవల్లనే! ఉదయం నిన్ను లేపడానిక్కి అన్నా, నేనూఎంత ప్రయత్నించామో! నీవెంతకూ లేవలేదు. మాకూ ఆలస్యం అయింది. బస్సు అందలేదు. తర్వాత బస్‌లో వస్తే ఇక్కడ ఈ అవమానం" అని ఏడ్చింది తండ్రివద్ద సరోజ.

అతని మనసు కుత కుత ఉడికిపోయింది. తల పంకించాడు.

* * *

ఉదయం పేపర్ ఇంటికి రాగానే అల వోకగా శీర్షికలన్నీ ఒకసారి చూస్తాడు శాస్త్రి.

"హరిజన బాలికపై ప్రిన్సిపాల్ అత్యాచారం!"

వేపకాయంత అక్షరాల ఆ శీర్షిక వద్ద అతని దృష్టి నిలచింది.

తమ జిల్లాలోనే....తమ గ్రామంలోనే!

అంతే! అతని గుండె ఝల్లుమన్నది. పేర్లు వ్రాయలేదు గాని ఆ వార్తలోని ప్రిన్సిపాల్ తనే!

'ఎంతకు తెగించాడు నారాయుడు? ఇది వాడి పనే!'

శాస్త్రి హృదయం కుత కుత లాడిపోయింది. తాను....'తాను విద్యార్థినిని-అందులోనూ హరిజన బాలికను చెరచడమా? ఛీ!-ఛీ!

'ఇక పత్రికల్లో లేఖల దుమారం అసెంబ్లీలో చర్చ, రగడ, ఊళ్ళో తలవంపులు! ఈ వార్తలోని నిజా నిజాలు ఎవరికి కావాలి?'

శాస్త్రి ఆలోచనలనుండి తేరుకోనే లేదు. పోలీస్ ఇనస్పెక్టర్ వచ్చాడు. శాస్త్రికి తల కొట్టేసినట్టుంది. వెర్రిగా చూస్తూ వుండిపోయాడు. అప్పటికి ఇంట్లో అందరికీ ఆ వార్త తెలిసింది.

భర్తకోసం కాఫీ తెస్తున్న లక్ష్మమ్మ చేతిలోని కప్పూ, సాసరూ క్రింద పడ్డాయి. చదువుకోడానికి పుస్తకం తెరిచిన అమ్మాయి చేష్టలు దక్కి అలానే వుండిపోయింది. స్నానం చేసి వస్తున్న పెద్దబ్బాయి గుమ్మం వద్దనే ఆగిపోయాడు.

ఏదో మహా మంత్రశక్తి వారినందర్నీ వివిధ భంగిమల్లో శిల్పాలుగా మార్చి వేసినట్టుంది దృశ్యం.

విచిత్రమైన నిశ్శబ్దం ఆవరించింది ఇంటిని. అందరి హృదయాలూ ఘోషిస్తున్నాయి. ఆ

ఘోష వినిపించే దెవరికి?

"స్టేషన్ కొకసారి వచ్చి మీరు వాంగ్మూలం ఇవ్వాలి!" అన్నాడు ఇనస్పెక్టర్ తలవంచుకొని ఏదో తప్పు చేస్తున్నట్టు.

పూజ గదిలోనికి వెళ్ళి దేవుడికి నమస్కరించి బయటకు వచ్చాడు శాస్త్రి.

దారిలో ఇనస్పెక్టర్ చెప్పాడు. "సరోజ మీద అత్యాచారం జరిగి నట్టు నారాయడు రిపోర్టు చేశాడు. ఆమె వ్రాసినట్టు చెప్పబడుతున్న ఫిర్యాదు కాగితం తెచ్చాడు. పది సాక్షులూ పకడ్ బందీగా చెబు తున్నారు. రిపోర్టు ఇచ్చి రెండు రోజులు గడిచినా నేను చర్య తీసుకోలేదని .... చూసారుగా పేపర్‌లో?"

జీప్‌లేక నడిచే వెళ్ళుతున్నారు ఇద్దరూ స్టేషన్‌కు. కాలుతున్న పెనం మీద నడుస్తున్నట్టుంది శాస్త్రి పరి స్థితి.

వాళ్ళు స్టేషన్‌కు వెళ్ళేటప్పటికే నారాయడు తన బలగంతో వచ్చి ఉన్నాడు అమీ తుమీ తేల్చుకో డానికి.

అందరూ కూర్చున్నాక....

"ఒరే పోలిగా! జరిగిందంతా చెప్పరా మళ్ళీ!" అడిగాడు ఇన స్పెక్టర్.

"సరోజమ్మ తొంగుంది. రాతిరి పది గంటలకు ఈ బాబుగారొచ్చి ఆ యమ్మకాడికెళ్ళి 'నాకు లొంగక పోతే నారిగాడి ఉజ్జోగం ఊడుద్ది' అంటూ పైటలాగి ఆటిని-ఆటిని.."

శాస్త్రి గంభీరంగా పోలిగాడి వైపు చూసాడు.

అంతే! వాడి మాటలు నోరు దాటి బయటకు రాలేదు. "ఒరే సూరిగా! నువ్వు చెప్పరా?" అంటూ ప్రక్కకు పోయాడు.

చెబుతున్న కొద్దీ సూరిగాడిలో కవిత్వమే తన్నుకొచ్చిందో, కల్లు ఎగదన్నిందో గాని దొర్లడం, పొర్లడం, లాక్కోపడం, పీక్కో పడం- తన్మయంగా నటనతో సహా చెప్పడం మొదలుపెట్టాడు.

అతని నటన నారాయడికీ జుగు ప్సగానే ఉంది.

అంత గంభీరతలోనూ నవ్వు వచ్చింది ఇనస్పెక్టర్‌కి. "సరిగ్గా సినిమా రేప్‌లా జరిగిందంటావ్!" అన్నాడు నవ్వుతూ.

అతనిలో గంభీరత సడలి, నవ్వుతూ మాట్లాడగానే సూరిగాడికి మరింత ధైర్యం కలిగింది. "అవు నండీ! ఈనకి రేప్‌కింగ్ బిరుదు ఇవ్వొచ్చు!"

"ఒరే! రాత్రి మీ గూడెం కేసి వచ్చాను. అప్పటికే నిద్రపోయా

రేంట్రా అందరూ?" స్నేహితులతో మాట్లాడుతున్నట్టు ఆత్మీయంగా అడిగాడు ఇనస్పెక్టర్.

"అవునండీ! మావంతా రాతిరి ఎన్మిదికే నిద్రోతావండి. తొమ్మిది దాటితే మా గూడెం సొసానమే!"

"రేప్ జరుగుతున్నప్పుడు నారాయడింట్లో లేడుట్రా?"

"లేడుండీ! తాగి కల్లు కొట్టు కాడ దొర్లుతున్నాడుండీ!"

కాల్చేసేటట్టు చూసాడు నారాయడు. కాని అతని చూపుని అందుకునే స్థితిలో లేడు సూరి.

"పరి సరోజ కేకలు విని- నువ్వు వాళ్ళింటికి పరిగెత్తుకు వెళ్ళావా?"

"లేదుండీ! నారిగాడే నన్ను లేపాడుండి. కాదుండీ....సరోజమ్మ కేకలు యినే పరిగెత్తానుండీ..అబ్బే నే నసలు...."

వేసుకున్న రిహార్సల్ అంతా మరిచిపోయాడు సూరి. కంగారు.. చెమట!

ఇంకా అతడే అవాకులు చెబుతాడేమోనని కాబోలు- పోలిగాడు ముందుకు వచ్చాడు.

"నానండీ-సరోజమ్మ కేకలు యిని ఎల్లిందిు!"

"అప్పుడు నీతో ఎంత మంది వచ్చారు?"

"నాను ఒక్కన్నే! కాదండీ... నానక్కడికి ఎల్లాక అందరూ ఒచ్చారండి." తల గోక్కొని దిక్కులు చూడటం మొదలు పెట్టాడు.

"అంటే....మిగిలిన వాళ్ళు రాడానికి 5 నిమిషాలు పట్టిందా?"

ఇబ్బందిగా చుట్టూ చూసి, "5 నిమిసాలు పట్టి వుంటాది" అన్నాడు.

"ఇంట్లో రేప్ జరుగుతోంటే- అందరూ వచ్చే వరకూ, అంటే 5 నిమిషాలు-సినిమా చూస్తున్నట్టు చూస్తూ ఊరకున్నావన్న మాట!"

"ఔనండీ!" అనేసి నాలుక కరుచుకున్నాడు పోలిగాడు.

కాలేజీకి వెళుతూ అప్పుడే ఆ విషయం తెలిసి స్టేషన్‌లోనికి వచ్చాడు ప్రసాద్ హడావుడిగా.

"ఈ సంఘటన ఏ రోజున జరిగింది సార్?" అడిగాడు.

చెప్పాడు యినస్పెక్టర్.

"సార్! అదే రోజు ప్రిన్సిపాల్ గారూ, నేనూ టౌన్‌కి వెళ్ళాం- కాలేజీ అయ్యాక. సినిమా కూడా చూసాం. రాత్రి పది గంటలకు మేం టౌను బస్‌స్టాండులో వున్నాం."

అనుకోని అభాండం మీద పడే

సరికి మతిపోయిన శాస్త్రి- హటాత్తుగా తెలివి వచ్చినట్టు, "అవునండీ యినస్పెక్టర్ గారూ! సినిమా నాకిష్టం లేదు. మేనేజర్ ఒకప్పుడు నా శిష్యుడు. బల వంతంగా హాల్లో కూర్చోబెట్టాడు. కావాలంటే మేనేజరుని, ఆ బస్ కండక్టర్‌ని కూడా అడగండి" అన్నాడు సంభ్రమంగా.

కథ అడ్డం తిరిగేసరికి, "వీళ్ళిద్దరూ కుమ్మక్కు అయ్యారు సార్!" ఉక్రోషంగా అరిచాడు నారాయుడు.

ఆనాడు నారాయుడు ముందుగానే యింటికి వెళ్ళి పోవడం వల్ల ప్రిన్సిపాల్ టౌన్ వెళ్ళిన విషయం అతనికి తెలియదు. ఇప్పుడు చింతించి ఏం లాభం?

"మాది కుమ్మక్కా?" అంటూ గిరుక్కున తిరిగి వెళ్ళిపోయాడు ప్రసాద్. పది నిమిషాల్లో సరోజను వెంట బెట్టుకు వచ్చాడు.

ప్రిన్సిపాల్‌గారు తమ యింటికి రాలేదనీ, అత్యాచారం జరిగినట్టు తానేమీ రిపోర్టు వ్రాసి యివ్వలేదనీ చెప్పిందామె- తండ్రి వైపు రుస రుస చూస్తూ.

"అది మైనర్! దానికేం తెలుసు? ఈ ప్రసాద్‌గాడు దాన్ని బెదిరించి యిలా చెప్పిస్తున్నాడు." అరుస్తున్నాడు నారాయుడు.

"నేను మైనర్‌నే! అందుకే అబద్ధం చెప్పలేను. కాని నా మీద అత్యాచారం జరిగిందో లేదో చెప్పలేనంత మైనర్‌ని కాను!" నిశ్చలంగా అంది.

"ఔనే! తండ్రిని ఎదిరించే మైనర్‌వి! తండ్రి పరువుతీసే మైనర్‌వి!" ఆవేశంగా అన్నాడు నారాయుడు-అది స్టేషన్ అని మరిచి.

"కూతురు సౌశీల్యం కోల్పోతే, ఆ రహస్యాన్ని హృదయంలోనే దాచుకుంటాడు తండ్రి. అసలు ఏమీ జరగందే కూతురు చెడిపోయిందని చాటించే నీవూ ఒక తండ్రివేనా?"

ఆవేశంగా ఏదో అనబోయింది గాని, గొంతుక కేదో అడ్డు వచ్చింది. కళ్ళు నిండిపోయాయి. గిరుక్కున వెను దిరిగి వెళ్ళి పోయింది.

*         *         *

ఆ రాత్రి ప్రసాద్‌కి సహపంక్తి భోజనం పెట్టాడు శాస్త్రి. దిగ్భ్రమ నుండి కోలుకోకుండానే భోజనం చేసాడు ప్రసాద్.

అతనికి తాంబూలం యిస్తూ, "ప్రసాద్! చిన్నవాడివి. నిన్ను పొగడకూడదు గాని, నీలో దేవుణ్ణి చూసానయ్యా యీ రోజు! ఇంత చదువూ చదివి, మారుతున్న సమా

జాన్ని చూస్తూ కూడా మారలేక, కులమూ, మతమూ అంటూ బూజులావేలాడుతున్న ప్రభుత్వానికి భయపడి మిమ్మల్ని మనుషుల్లా చూస్తున్నా గానీ, నా హృదయాంతరంలో ఇంతకాలమూ భేద భావం వుండిపోయింది. ఈ నాటితో నా మనో మాలిన్యాన్ని కడిగి వేసుకుంటున్నా" అన్నాడు ఆర్ద్రంగా.

* * *

అత్యాచారం గురించి పెద్ద అక్షరాలతో ప్రచురించిన ఏ పత్రికా తరువాత జరిగిన విషయాల్ని ప్రచురించనే లేదు!

నారాయడు లాంగ్ లీవ్ పెట్టేసాడు. సరోజ కాలేజీకి రావడంలేదు.

తగిన చర్య తీసుకోలేని యినస్పెక్టర్‌ని బదిలీ చేయాలనీ, ప్రిన్సిపాల్‌ని సస్పెండ్ చేయాలనీ అసెంబ్లీలో రగడ! బల్లల మోత! వాక్ అవుట్‌లూను!

సరోజకు యిల్లొక నరకం అయింది. నారాయడామెను కాల్చుకు తింటున్నాడు.

ఓ సాయంకాలం ధైర్యం కూడదీసుకుని ప్రసాద్ వాళ్ళ యింటికి వెళ్ళాడు. వాడలోని వాళ్ళంతా అతనిని చుట్టు ముట్టారు.

ప్రసాద్ వల్లనే సరోజ తండ్రికి ఎదురు తిరిగిందనీ, శాస్త్రి తప్పించుకు పోయాడనీ, ఆ కులానికి సాయం చేసే వాళ్ళందరూ ద్రోహులనీ వాదించడం మొదలు పెట్టారు.

ప్రసాద్ ఏం చెప్పబోయినా వినదలుచుకోలేదు వాళ్ళు.

"పోరా ఎదవా! నీవు మాకు సెప్పొత్తావా? సెప్పులు కుట్టుకునే వాడికి ఉజ్యోగం యిత్తే యిలాగే వుంటాది." కర్ర ఎత్తాడు పోలిగాడు.

ఎక్కడనుండి వచ్చిందో-మెరుపులా దూసుకు వచ్చింది సరోజ. అతనికి అడ్డు నిలిచింది.

ప్రసాద్‌కి తగలవలసిన దెబ్బ ఆమెకు తగిలింది. రక్తం!

అందరూ చేష్టలు దక్కి-బొమ్మల్లా నిలిచిపోయారు. తల్లి వచ్చి సరోజను యింటికి తీసుకుపోయి కట్టు కట్టింది.

అందరి నోళ్ళూ కట్టుబడినాక నోరు తెరిచాడు ప్రసాద్ —

"అగ్రకులాల వారూ, భూస్వాములూ కొన్ని శతాబ్దాలుగా అడ్డుగోడలు కట్టుకొని మనల్ని బయటకు నెట్టేసారు. మనల్ని అవమానించారు. హింసించారు. మానభంగాలు చేసారు. హత్యలు చేసారు. జైళ్ళల్లో తోయించారు. మన పెద్దలంతా యిలా బాధలు పడినవారే! అయితే యిప్పుడు

రోజులు మారాయి. ప్రభుత్వం మన కొక వరాన్ని ప్రసాదించింది. ఆ వరాన్ని సద్వినియోగం చేసుకుందాం. వాళ్ళు కట్టిన గోడల్ని కూలగొడదాం. అందరమూ కలిసి ముందుకు సాగుదాం. అంతేగాని, మనం కూడా కొత్త గోడలు కట్టుకొని వాళ్ళు చేసిన అన్యాయాలే మనమూ చేస్తోంటే—ప్రభుత్వం యిచ్చిన వరాన్ని మనం దుర్వినియోగం చేస్తున్నామన్న మాట! భస్మాసురిడి కథ మీకు తెలిసిందే కదా. అతని వరమే అతనిని కాల్చివేసింది. మన వరం మనల్ని కాల్చివేయకూడదు. మనం నాశనం కాకూడదనే నేను శాస్త్రిగారి తరఫున కాదు-న్యాయం తరఫున సాక్ష్యం చెప్పాను. ఆ శాస్త్రిగారే రేపు ఏదైనా అన్యాయం తలపెడితే అతనికి వ్యతిరేకంగా పని చేయడానికి వెనుకాడను. వాళ్ళూ, మనం అనే భేదం వద్దు. కలిసి సాగుదాం."

అప్పటికి తల కట్టుతో, చేతిలో సూట్‌కేసుతో సరోజ అక్కడికి వచ్చింది.

"పద ప్రసాద్, పోదాం!" అంది నిశ్చలంగా.

ఆశ్చర్యంగా అందరూ ముఖాలు చూచుకున్నారు.

"ఎక్కడికి?" గర్జించాడు నారాయుడు.

నిశ్చలంగా ముందుకే చూస్తున్నదామె.

"మీ పగ తీర్చుకోడానికి—నా సౌశీల్యానికే మచ్చ తెచ్చిన మీ యింటిలో నే నొక్క క్షణం ఉండలేను" అంది ముందడుగేస్తూ.

కొరడా దెబ్బ తిన్నట్టు ఉలిక్కిపడ్డాడు నారాయుడు.

"ఆగండి. నా మైనర్ కూతుర్ని ఎత్తుకుపోయాడని ప్రసాద్ మీద కేసు పెడతాను." ఉరిమాడు.

అయినా ఆమె వెనుదిరగ లేదు. అదే నిశ్చలతతో, "మీకు కేసులు తప్ప మనసులు, మానవత్వం తెలీదు. సరే. మైనారటీ తీరే వరకూ నేను అన్నయ్యతో వుంటా. తరువాత వచ్చి ప్రసాద్‌ని వివాహం చేసుకుంటా."

జంట ముందడుగు వేసింది.

నోరు తెరుచుకొని చూస్తూ వూరుకున్నాడు నారాయుడు.

అక్కడ చేరిన జనం నారాయుడి వైపు చూసారు.

చేయీ చేయీ కలిపి ముందడుగు వేస్తున్న యువతరం ప్రతినిధులను చూసారు. కాసేపు ఆలోచించారు.

ఒకరొకరే ఆ జంట తొక్కిన దారినే కదిలి పోయారు- వారిని సాగనంపడానికా—అన్నట్లు!

అక్కడ నారాయుడు ఒక్కడే మిగిలాడు. *